మల్లాది వెంకట కృష్ణమూర్తి

అమృతాంజనరావు పేరు వినగానే అది మన రాష్ట్రం లోని నీటి పారుదల శాఖ మంత్రి పేరు అనిపించదు.

ఎందుకంటే ఫలానా పేరు మాత్రమే మంత్రులకి వుండాల దన్న నియమం లేదుగా. కాని తెలుగుదేశంలోని, రోజూ పేపర్ చదివే ఏ వ్యక్తిని "అమృ తాంజనరావు ఎవరు?" అని అడిగినా వెంటనే జవాబు చెప్ప గలడు.

"మన రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి" అని జవాబు చెప్తారని మీరను కుంటే పప్పులో కాలేసినట్లే! ఆ వ్యక్తి చెప్పే జవాబు "మన రాష్ట్రంలోని ఇంత దాకా వున్న మంత్రులందరిలోకి అతి పచ్చి లంచగొండి" అనో లేదా "కొద్దిగా ఖర్చయినా ఫరవాలేదు కాని ఆయనతో ఎలాంటి పని అయినా చేయించుకో వచ్చు" అనో చెప్తారు.

సదరు అమృతాంజనరావు భార్య పేరు అనిమ. అనిమా బసు నిజానికి. వివాహం అయ్యాక 'బసు' పోయింది. మీరనుకున్నది కరెక్టే. ఆవిడ బెంగాలీ. కలకత్తా స్వస్థలం.

ఆవిడ భర్త రాష్ట్ర మంత్రి అయ్యాక అనిమ బంధువులు చాలామంది హైదరాబాద్ వచ్చారు కోరమండల్ ఎక్స్‌ప్రెస్ ఎక్కి. వాళ్లలో అంతదాకా ఎవరూ డిప్యూటీ తహసిల్దార్ లెవెల్ దాకా కూడా రాకపోవడంతో తమలో ఒకరు 'మంత్రి భార్య' లెవెల్‌కి ఎదగడం వాళ్లకి ఎంతో ఆనందంగా అనిపించింది.

రాష్ట్ర ప్రభుత్వపు నల్ల రంగు అంబాసిడర్ కార్లు రెండు స్టేషన్‌కి వచ్చి ఆ బంధుజనాన్ని ఇంటికి చేర్చాయి. ఇంటి బయట తుపాకి పట్టుకున్న పోలీసు, ఇంట్లో నౌకర్లు చూసి అంతా సంబరపడ్డారు.

ఆ రోజు సాయంత్రం ఓ ముస



లావిడ వాళ్లింట్లోని జపనీస్ సోని టి.వి.ని, ఏడు కిలోమీటర్ల దాకా పని చేసే కార్డ్‌లెస్ టెలిఫోన్‌ని, వి.సి.ఆర్.ని, రెండు మారుతి కార్లని, మూడు స్కూటర్లని, ఇంకా అన్నం తిన డానికి వుపయోగించే వెండి కంచాలని, వెండి గ్లాసులు, చెంచాలు, పాత్రలని చూసి తెగ ఆశ్చర్యపోయింది.

"మీ ఆయన జీతం నెలకో లక్ష రూపాయల దాకా వస్తుందిటే?" అడిగింది అనిమని.

"అమ్మో! అంత రాదు" అని జీతం ఎంతో చెప్పింది.

"ఆ జీతంతో ఇవ్వి ఎలా కొన గలిగారే?" బుగ్గలు నొక్కుకుంటూ అడిగింది అనిమ బంధువు.

ఆ ప్రశ్నకి ఆమె సమాధానం చెప్ప లేకపోయింది. ఆ రాత్రి తన భర్త అమృతాంజనరావుని అడిగింది తక్కువ జీతంతో ఇంట్లో అంత సామానెలా అమర్చుకోగలిగారని.

అందుకాయన చిన్నగా నవ్వి ఓ ఫోటోని చూపించి అడిగాడు.

"ఇదేమిటి?"

"వంతెన" చెప్పింది అనిమ.

"దీన్ని కట్టడానికి అయిన ఖర్చులో పది శాతం మనదే" చెప్పాడు అమృ తాంజనరావు గర్వంగా.

కొన్ని వారాలు గడిచాక ఆయన తన భార్యకి నెక్లెస్, గాజులు, వుంగరం — అన్నీ రవ్వలవి — ఓ సెట్ కొని తెచ్చాడు. వాటి ఖరీదు లక్షల్లో వుంటుం దని గ్రహించిన అనిమ ఆసక్తిగా అడిగింది అంత డబ్బు ఎక్కడ నించి వచ్చిందని.

ఆయన ఇంకో ఫోటో చూపించి అడిగాడు.

"ఇదేమిటి?"

"ఇంకో వంతెన. కాని ఇదివరకటి దానికన్నా చిన్నగా వుంది" చెప్పింది అనిమ.

"ఇరవై శాతం" చెప్పాడాయన గుంభనంగా.

"బోలెడు వంతెనలు కట్టిస్తుం డండి" చెప్పింది అనిమ సంబర పడిపోతూ.

కొన్ని నెలల తర్వాత ఓ రోజు అమృతాంజనరావు ఓ బ్రీఫ్‌కేస్‌తో వచ్చి భార్యని పిలిచి గది తలుపులు వేసేసి చెప్పాడు ఆమెతో.

"ఇది తెరిచి చూడు".

తెరవగానే అనిమ కళ్లు చెదిరేలా అయిదు వందల రూపాయల నోట్ల కట్టలు అందులో కుక్కి వున్నాయి.

"ఇంత డబ్బే? దీంతో అటు ఏడు, ఇటు ఏడు తరాలు కాలుమీద కాలు వేసుకుని తినొచ్చు" చెప్పింది.

"అవును" చెప్పాడాయన గర్వంగా.

అనిమ కొన్ని క్షణాలు ఆలోచించి అడిగింది-

"ఏదీ, ఫోటో చూపించండి."

"ఏ ఫోటో?" అడిగాడు అమృ తాంజనరావు.

"వంతెన ఫోటో ఎంతో పొడుగ్గా వుంటే కాని ఇంత డబ్బు రాదుగా."

"వంతెన కాదు. ఆనకట్ట. ఫోటో లేదు".

"ఫోటో ఎందుకు లేదు? ఈసారి ముప్పై శాతం కదండి!" అడిగింది అనిమ సంబరంగా.

"వెర్రి మొహమా. వంద శాతం. అందుకే ఫోటో లేదు" చెప్పాడు అమృతాంజనరావు. ●